# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంపుటి : 2 | సంచిక : 304 | మంగళవారం 25 జూన్ 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం తెలుగు దిన పత్రిక

సంప్రదించండి

తెలంగాణ 8099779988

ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టలు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను


## రక్షణ శాఖ భూములు కేటాయించాలి



- ఢిల్లీలో రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సమావేశం
- భేటీ సందర్భంగా ముఖ్యమంత్రి వెంట ఎంపీలు
- రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం రక్షణ శాఖ భూమిని అప్పగించాలని విజ్ఞప్తి
- కొన్ని జిల్లాల్లో సైనిక్ స్కూల్స్ పెంపు కోసం విజ్ఞప్తి

ఢిల్లీ

రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి వెంట కడియం కావ్య, చామల కిరణ్ కుమార్ రెడ్డి తదితర ఎంపీలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా తెలంగాణలోని వివిధ రక్షణ శాఖ భూముల బదలాయింపుపై విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లో రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం కోసం రక్షణ శాఖ భూమిని అప్పగించాలని కోరారు. అలాగే, కరీంనగర్, రామగుండం కనెక్టివిటీ కోసం రక్షణ శాఖ భూముల అప్పగింతపై కూడా విజ్ఞప్తి చేశారు. ప్యారడైజ్ నుంచి బోయినపల్లి, సుచిత్ర రహదారిలో రోడ్డు చిన్నగా ఉండి, ట్రాఫిక్ జామ్ అవుతుంటుంది. ఈ మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం రక్షణ శాఖ భూమిని అప్పగించాలని కోరారు. అలాగే, కొన్ని జిల్లాల్లో సైనిక్ స్కూల్స్ పెంపు కోసం విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి - మిగతా3లో

## సమ్మె యధాతథం



- వైద్యారోగ్య శాఖ మంత్రితో చర్చలు అసంపూర్ణం..
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్‌తో.. అసంపూర్తిగా ముగిసిన జూడాల చర్చలు
- కొన్ని అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారు.
- మరికొన్ని అంశాలపై మరోమారు చర్చించాలని నిర్ణయం తీసుకున్నారు.
- ప్రస్తుతానికి సమ్మె యధాతథంగా కొనసాగిస్తాం
- చర్చలు అసంపూర్తిగా ముగిశాయి

హైదరాబాద్

తమ డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ వ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు సమ్మె చేస్తున్నారు. నేడు(మంగళవారం) వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాతో జూడాలు చర్చలు జరిపారు. ఈ చర్చలు - మిగతా3లో




## బీజేపీకి ఊహించని షాక్..


- ఇక మద్దతు ఇచ్చేదే లేదంటూ బీజేడీ సంచలన ప్రకటన
- బీజేడీతో సంబంధాలు తెంపుకొని.. ఈసారి ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే రంగంలోకి
- సుదీర్ఘకాలం నుంచి సీఎంగా కొనసాగించిన నవీన్ పట్నాయక్‌కు బ్రేకులు వేసి.. ఆ పార్టీ అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.
- బీజేపీకి మద్దతు ఇవ్వొద్దు
- రాజ్యసభలో బలమైన ప్రతిపక్షంగా ఎదగాలని సూచన
- 24 ఏళ్ల తర్వాత ఆ రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయిన బీజేడీ



## 50 ఏళ్ల క్రితంనాటి ఎమర్జెన్సీని మోదీ నిత్యం ప్రస్తావిస్తూనే ఉంటారు కానీ...

- నాడు ప్రకటన తర్వాతే ఎమర్జెన్సీని అమలు చేశారన్న ఖర్గే
- ఎలాంటి ప్రకటన చేయకుండా మోదీ ఎమర్జెన్సీని కొనసాగిస్తున్నారని విమర్శ
- ఇలాంటి మాటలతో ఎంతకాలం మభ్యపెడతారంటూ ఆగ్రహం

## సారు...కారు... బేజారు..



- మొన్నటి వరకు.. అంటే అధికారం పోయేంత వరకు ఏ రోజైనా పార్టీ నేతలతో భేటీ అయ్యారా?
- కనీసం ఎమ్మెల్యేలతో అయినా మాట్లాడరా? లేదు
- కేసీఆర్‌ను తమ ఓటుతో నేలకు దించారు ప్రజలు. దీంతో ఇప్పుడు అందరూ కనిపిస్తున్నారు
- అందరితో ముచ్చటించేందుకు ప్రయత్నిస్తున్నారు..
- ఎందుకంటే ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు నేరుగా కేసీఆర్ రంగంలోకి దిగినా పనులు కావడం లేదని ప్రస్తుతం ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లో వినిపిస్తున్న టాక్

హైదరాబాద్

అందితే జుట్టు.. లేదంటే కాళ్లు.. ఈ సామెత పర్‌ఫెక్ట్‌గా సూటవుతుంది. మాజీ సీఎం, ప్రస్తుత బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుకు. ఎందుకీ మాట అనాల్సి వస్తుందంటే ఇప్పుడు ఆయన చేసే చర్యలు అలా ఉన్నాయి కాబట్టి - మిగతా3లో



## ఏకపక్ష చర్చలను వ్యతిరేకిస్తున్నాం

- తీస్తా నదీ జలాల పంపిణీపై ఇటీవల బంగ్లాదేశ్, కేంద్ర సర్కారు మధ్య చర్చలు
- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోకుండా అలాంటి చర్యలు, చర్చలు చేపట్టడం సరికాదు
- భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉన్న ఫరక్కా ఒప్పందాన్ని రెన్యువల్ చేయాలన్న ఆలోచనలో కేంద్ర సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది
- అలాంటి ఒప్పందాల వల్ల బెంగాల్ ప్రజలు తీవ్ర ప్రభావానికి గురవుతారు
- మోదీకి లేఖ రాసిన దీదీ

## రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- శ్రీశైలంలో తెలంగాణ డిప్యూటీ సీఎం
- శ్రీశైల మల్లికార్జునస్వామి వారిని దర్శించుకున్న భట్టివిక్రమార్క
- ఇరురాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని దేవుడిని కోరుకున్నట్లు వెల్లడి
- తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తికి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడి



హైదరాబాద్

రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాను స్వామివారిని మొ క్కుకున్నానని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సోమవారం ఆయన కుటుంబసభ్యులు, మంత్రి జూపల్లి కృష్ణారావు, - మిగతా3లో



- తెలంగాణలో అధికారంలోకి రావాలని టార్గెట్ పెట్టుకున్న కమలనాథుల సంగతేంటి?
- వ్యూహం ఉందా? మాటలకే పరిమితం అవుతారా?
- కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ స్పీడ్ ను పెంచి దూకుడు మీద ఉంది.
- బీఆర్ఎస్, బీజేపీ సహా ఇతర పార్టీల నేతలను పార్టీ వైపుకు తిప్పుకోవడంలో హస్తం నేతలు సక్సెస్

## కమలం... యాక్షన్ ప్లాన్ ఏంటీ

హైదరాబాద్

తెలంగాణలో అధికారంలోకి రావాలని టార్గెట్ పెట్టుకున్న కమలనాథుల సంగతేంటి? వ్యూహం ఉందా? మాటలకే పరిమితం అవుతారా? తెలంగాణలో రాజకీయ పరిణామాలు స్పీడుగా మారుతున్నాయి. కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ స్పీడ్ ను పెంచి దూకుడు మీద ఉంది. బీఆర్ఎస్, బీజేపీ సహా ఇతర పార్టీల నేతలను పార్టీ వైపుకు తిప్పుకోవడంలో హస్తం నేతలు సక్సెస్ అవుతున్నారు. మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రేపో మాపో మరికొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమవుతున్నారనే టాక్ బలంగా వినిపిస్తోంది. దీంతో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ లో బీజేపీ ముఖ చిత్రం ఏ విధంగా ఉండబోతుందనేది హాట్ టాపిక్ గా మారింది.గత అసెంబ్లీ ఎన్నికల్లో మిషన్ 90 లక్ష్యంతో ప్రచారాన్ని ఊదరగొట్టిన బీజేపీ.. 90 అసెంబ్లీ స్థానాలు సాధిస్తామని చెప్పి బొక్క బోర్లా పడింది. పార్లమెంట్ ఎన్నికల్లో మోడీ గ్యారంటీ తో డబుల్ డిజిట్ స్థానాలకు లెక్కలేసుకున్న బీజేపీ.. కొంత లాభపడినప్పటికి, సింగిల్ డిజిట్ కే పరిమితం కావలసి వచ్చింది. కానీ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడొచ్చినా - మిగతా3లో

# బీజేపీకి ఊహించని షాక్

గతంలో బీజేపీ ఒడిశాలోని బీజేడీ పార్టీలు సహజీవనం చేశాయి. కానీ.. ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేవు. బీజేడీతో సంబంధాలు తెంపుకొని.. ఈసారి ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే రంగంలోకి దిగింది. సుదీర్ఘకాలం నుంచి సీఎంగా కొనసాగించిన నవీన్ పట్నాయక్‌కు బ్రేకులు వేసి.. ఆ పార్టీ అక్కడ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలోనే.. నవీన్ పట్నాయక్ తన రాజ్యసభ ఎంపీలకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జూన్ 27వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కానున్న తరుణంలో.. బీజేపీకి మద్దతు ఇవ్వొద్దని, రాజ్యసభలో బలమైన ప్రతిపక్షంగా ఎదగాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశాలను తగిన రీతిలో లేవనెత్తాలని చెప్పారు. జూన్ 24న తన రాజ్యసభ ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో నవీన్ పట్నాయక్ ఈమేరకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశం అనంతరం బీజేడీ రాజ్యసభ ఎంపీ సస్మిత్ పాత్రా మాట్లాడుతూ.. బీజేడీ ఎంపీలు ఈసారి కేవలం రాష్ట్ర సమస్యలపై మాట్లాడటమే కాదు, కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఒడిశా ప్రయోజనాలని విస్మరిస్తే ఆందోళనకు దిగాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. ప్రత్యేక హోదా డిమాండ్‌తో పాటు పేలవమైన మొబైల్ కనెక్టివిటీ, మితంగా ఉన్న బ్యాంకు శాఖల సమస్యల్ని కూడా లేవనెత్తుతారని అన్నారు. బొగ్గు రాయల్టీని సవరించాలన్న ఒడిశా డిమాండ్‌ను గత 10 ఏళ్లుగా కేంద్రం విస్మరించిందని.. దీని వల్ల రాష్ట్ర ప్రజలకు సరైన వాటా దక్కకుండా పోతోందని చెప్పారు. ఇకపై తాము బీజేపీకి మద్దతు ఇవ్వమని.. ప్రతిపక్షంగానే కొనసాగుతామని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం




ఎంతవరకైనా వెళ్తామన్నారు. ఒడిశా డిమాండ్లను ఎన్డీఏ ప్రభుత్వం విస్మరిస్తే.. బలమైన, శక్తివంతమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని తమ అధ్యక్షుడు కోరారని పేర్కొన్నారు. ఇదిలావుండగా.. రాజ్యసభలో బీజేడీ తొమ్మిది ఎంపీలను కలిగి ఉంది. అయితే.. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క సీటుని కూడా గెలుచుకోలేకపోయింది. 1997లో ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ పార్టీకి ఇలాంటి పరాభావం ఎదురుకావడం ఇదే మొదటిసారి. అంతేకాదు.. 24 ఏళ్ల తర్వాత ఆ రాష్ట్రంలో బీజేడీ అధికారాన్నీ కోల్పోయింది. కొన్ని సంవత్సరాల నుంచి వివిధ సమస్యలపై పార్లమెంటులో బీజేపీకి బీజేడీ మద్దతు ఇస్తూ వచ్చింది. 2019, 2024లో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రాజ్యసభకు ఎన్నిక కావడానికి కూడా సహాయపడింది. కానీ.. ఇప్పుడు అలాంటి మద్దతు ఉండదని బీజేడీ తేల్చి చెప్పేసింది.

## ఏకపక్ష చర్చలను వ్యతిరేకిస్తున్నాం..



**న్యూఢిల్లీ:** తీస్తా నదీ జలాల పంపిణీపై ఇటీవల బంగ్లాదేశ్, కేంద్ర సర్కారు మధ్య చర్చలు జరిగాయి. ఆ చర్చలను ఏకపక్షంగా నిర్వహించినట్లు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆమె ప్రధాని మోదీకి లేఖ రాశారు. బంగ్లాదేశ్‌తో జరిగిన చర్చలకు తమను ఆహ్వానించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోకుండా అలాంటి చర్యలు, చర్చలు చేపట్టడం సరికాదు అని, ఆమోదించలేమని ఆమె అన్నారు. గంగా నది, తీస్తా నది జలాల షేరింగ్ అంశంపై ఇటీవల ప్రధాని షేక్ హసీనా, మోదీ మధ్య చర్చలు జరిగాయి. భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉన్న ఫరక్కా ఒప్పందాన్ని రెన్యువల్ చేయాలన్న ఆలోచనలో కేంద్ర సర్కారు ఉన్నట్లు తెలుస్తోందని, 1996లో కుదిరిన ఆ చట్టం.. 2026లో ముగిసిపోనున్నదని, ఆ ఒప్పందం ప్రకారం భారత్, బంగ్లా మధ్య నీటి పంపిణీ జరుగుతుందని ఆమె అన్నారు. పశ్చిమ బెంగాల్‌పై ఆ ఒప్పంద ప్రభావం ఎక్కువగా ఉంటుందని ఆమె తన లేఖలో తెలిపారు. అలాంటి ఒప్పందాల వల్ల బెంగాల్ ప్రజలు తీవ్ర ప్రభావానికి గురవుతారన్నారు. నీట్ పరీక్షా వ్యవస్థను రద్దు చేయాలని కూడా తన లేఖలో దీదీ కోరారు. పేపర్ లీకేజీని దృష్టిలో పెట్టుకుని, ఆ పరీక్షలను రాష్ట్రాలే నిర్వహించే విధంగా వ్యవస్థను రీస్టోర్ చేయాలని ఆమె కోరారు.

## 50 ఏళ్ల క్రితంనాటి ఎమర్జెన్సీని మోదీ నిత్యం ప్రస్తావిస్తూనే ఉంటారు కానీ...



50 ఏళ్ల క్రితం విధించిన ఎమర్జెన్సీ గురించి ప్రధాని నరేంద్రమోదీ నిత్యం ప్రస్తావిస్తూనే ఉంటారని... కానీ పదేళ్లుగా ఎలాంటి ప్రకటన చేయకుండానే ఎమర్జెన్సీని కొనసాగిస్తున్నారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఇందిరాగాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధిస్తున్నామని ప్రకటించాకే దానిని అమలు చేసినట్లు చెప్పారు. ఇలాంటి మాటలతో ప్రజలను మభ్యపెడుతూ ఎంతకాలం అధికారంలో కొనసాగాలనుకుంటున్నారని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను మంటగలుపుతోందన్నారు. లోక్ సభ ఎన్నికలకు ముందే దేశవ్యాప్తంగా చాలా పార్టీలు బీజేపీకి వ్యతిరేకంగా ఏకమయ్యాయని గుర్తు చేశారు.

**ఎమర్జెన్సీని ప్రస్తావించిన మోదీ**

లోక్ సభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ప్రధాని మోదీ మాట్లాడుతూ... ఎమర్జెన్సీకి రేపటితో 50 ఏళ్లు పూర్తవుతాయని... దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది ఓ మాయని మచ్చ అన్నారు. యాభై ఏళ్ళ క్రితం జరిగిన పొరపాటు పునరావృతం కాకూడదని హితవు పలికారు.

## మార్చి 2025 నాటికి అయోధ్య రామాలయం



### పనులన్నీ పూర్తి : నృపేంద్ర మిశ్రా

అయోధ్య రామమందిరం నిర్మాణ పనులను కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. రామమందిరం మొదటి అంతస్తు నిర్మాణం 90శాతం పూర్తయ్యిందని పేర్కొంది. వచ్చే జూలై నాటికి తొలి అంతస్తు పూర్తిగా సిద్ధమవుతుందన్నారు. మొదటి అంతస్తులో రామ్ దర్బార్‌ను ఏర్పాటు చేయనున్నారు. 2025 మార్చి నాటికి ప్రాకారంతో సహా మంది నిర్మాణం పూర్తవుతుందని చెప్పారు. ఆ తర్వాత తొలి అంతస్తులో రామ్ దర్బార్ విగ్రహాలను పాలరాతితో తయారు చేయనున్నట్లు నృపేంద్ర పేర్కొన్నారు. ఇందుకోసం రాజస్థాన్‌కు చెందిన నలుగురు శిల్పులతో చర్చలు జరిపారని.. టెండర్ ప్రక్రియ సైతం జారీ చేసినట్లు పేర్కొన్నారు. నెలాఖరులోగా టెండర్లు తెరువనున్నట్లు చెప్పారు. విగ్రహ తయారీకి శిల్పిని ఎంపిక చేస్తారన్నారు. ఇదిలా ఉండగా.. గర్భాలయంలో కొలువుదీరిన రామ్‌లల్లాను దర్శించుకునేందుకు భక్తులు తరలివస్తున్నారు. ప్రస్తుతం నిత్యం లక్షమందికిపైగా భక్తులు తరలివస్తున్నారు. ప్రాణ ప్రతిష్ఠ తర్వాత ఇప్పటి వరకు దాదాపు రెండుకోట్ల మందికిపైగా దర్శనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. సమావేశంలో రామ మందిరం నిర్మాణ పురోగతి, మ్యూజియం నిర్మాణంపై చర్చించారు.

## పీయూష్ స్థానంలో జేపీ నడ్డా.. రాజ్యసభ పక్ష నేతగా నియామకం



**ఢిల్లీ:** రాజ్యసభ సభ పక్ష నేతగా కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాను ఆ పార్టీ ప్రకటించింది. లోక్ సభ ఎన్నికల్లో ముంబై నార్త్ నియోజకవర్గం నుంచి ఎంపీగా గెలిచిన పీయూష్ గోయల్ స్థానంలో ఆయన్ని నియమించింది. గోయల్ జులై 5, 2010న రాజ్యసభ ఎంపీగా ఎన్నికయ్యారు. 2021 జులై 14న ఆయన్ని రాజ్యసభ సభా నాయకుడిగా ప్రకటించారు. జూన్ 4న లోక్‌సభ ఎంపీగా ఎన్నికై, జూన్ 24న దిగువ సభలో ప్రమాణ స్వీకారం చేశారు. %జీూ% నడ్డా

## ప్రశ్నాపత్రాల లీకేజ్‌తో విద్యార్థుల భవితవ్యం భగ్నం : కాషాయ పార్టీపై అఖిలేష్ యాదవ్ ఫైర్



పేపర్ల లీకేజీ వ్యవహారం కొత్త విషయం కాదని, యూపీలో ఇది పెద్ద అంశం కాగా, ఇప్పుడు ఢిల్లీకి కూడా పాకిందని ఎస్పీ చీఫ్, ఆ పార్టీ ఎంపీ అఖిలేష్ యాదవ్ అన్నారు. కాషాయ పార్టీ తన సొంత మనుషుల మెప్పు పొందేందుకు ప్రశ్నాపత్రాలను లీక్ చేయడం చూశామని చెప్పారు. అఖిలేష్ సోమవారం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ ఇది బీజేపీ తరహా లీకేజ్ అని ఎద్దేవా చేశారు. నీట్-యూజీ పరీక్ష రద్దు, ప్రశ్నాపత్రాల లీకేజ్, పరీక్షల నిర్వహణలో లోటుపాట్లపై యువత తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోందని చెప్పారు. లక్షలాది విద్యార్థుల భవిష్యత్ ప్రభుత్వ నిర్వాకంతో అంధకారంలో పడిందని దుయ్యబట్టారు. కాషాయ పాలకులు అసమర్ధ విధానాలతో కోట్లాది ప్రజలను మోసం చేశారని అఖిలేష్ యాదవ్ మండిపడ్డారు.

## రాజ్యాంగ ప్రతులతో విపక్షాల నిరసన.. బీజేపీపై తీవ్ర విమర్శలు



**ఢిల్లీ:** ఎన్డీయే సర్కార్ మూడో సారి అధికారం చేపట్టిన తరువాత సోమవారం తొలి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. బీజేపీ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్‌తో సహా ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు పార్లమెంటు ఆవరణలో నిరసనకు దిగారు. రాజ్యాంగ ప్రతులను చేతిలో పట్టుకుని, దానిని కాపాడాలంటూ నేతలు నినాదాలు చేశారు. బీజేపీ రాజ్యాంగాన్ని అవమానిస్తోందని ఆరోపించారు. మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. 'మోదీజీ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకే ఈరోజు అన్ని పార్టీల నేతలు ఒక్కతాటిపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు.బీజేపీ నేతలు గాంధీజీ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని బద్దలు కొడుతున్నారు. మనం రాజ్యాంగం ప్రకారం ముందుకెళ్లాలి. మోదీ.. ఎమర్జెన్సీ గురించి 100 సార్లు చెబుతారు. ఎమర్జెన్సీ విధించకుండానే ఆయన ప్రజల హక్కులను కాలరాస్తున్నారు. ఇలా ఇంకెంత కాలం పాలించాలనుకున్నారు" అని ఖర్గే ప్రశ్నించారు.

**రాజ్యాంగాన్ని ఉల్లంఘించారు..**

టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి బీజేపీ.. ప్రోటెం స్పీకర్ నియామకం చేసిందని ఆరోపించారు. నిబంధనలను ఉల్లంఘించినందుకే నిరసన తెలుపుతున్నామని.. ప్రొటెం స్పీకర్‌ను నియమించిన తీరు రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. మోదీకి వ్యతిరేకంగా ఏకమవుతున్న తమ వెంట ప్రజలు ఉన్నారని.. రానున్న రోజుల్లో దేశ వ్యాప్త ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

## జీఎస్టీ ఏడేండ్ల ప్రస్థానంలో సామాన్యుడికి మేలు



జీఎస్టీ ఏడేండ్ల ప్రస్థానంలో పన్ను రేట్లు తగ్గి 140 కోట్ల మంది భారతీయుల జీవితాలు మెరుగుపడ్డాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. జీఎస్టీతో పలు ప్రయోజనాలు చేకూరాయని ఓ వార్తా సంస్థ నివేదికను ప్రస్తావిస్తూ ప్రధాని ఎక్స్ వేదికగా వివరాలు పంచుకున్నారు. జీఎస్టీ ప్రవేశపెట్టిన అనంతరం గృహ వినియోగ వస్తువులు తక్కువ ధరకు లభ్యమవుతున్నాయని పేర్కొన్నారు. జీఎస్టీ అమలు అనంతరం పలు రకాల పిండ్లు, పెరుగు, డిటర్జెంట్ వంటి రోజువారీ వినియోగ వస్తువుల ధరలు తగ్గడంతో సగటు ప్రజలు, పేదల పొదుపు రేట్లు పెరిగాయని చెప్పారు. ప్రజల జీవితాలను మెరుగుపరిచే క్రమంలో తాము ఈ సంస్కరణలను కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. జీఎస్టీ ప్రవేశపెట్టిన తర్వాత టీవీ, డిటర్జెంట్ హెయిర్ ఆయిల్, సోప్ వంటి పలు వస్తువుల ధరలు తగ్గాయని సీబీఐటీ గణాంకాలు వెల్లడించాయి. కాగా, 2017లో జీఎస్టీ అమలు ప్రారంభం కాగా, ఈ ఏడాది జులై 1న నూతన పన్ను వ్యవస్థ ఏడేండ్ల ప్రస్థానం పూర్తిచేసుకుంటుంది.

## మిమ్మల్ని మీరు ఎప్పుడూ తక్కువ అంచనా వేసుకోవద్దు

**'మండే మోటివేషన్' పేరిట స్ఫూర్తివంతమైన వీడియో పంచుకున్న వ్యాపారవేత్త**

**మీరు ఊహించిన దానికంటే ఎక్కువ కండబలం మీకు ఉండవచ్చు అనే లైన్‌తో వీడియో పోస్ట్**

**సోషల్ మీడియాలో ఆనంద్ మహీంద్రా ట్వీట్ వైరల్**



వ్యాపార వేత్త ఆనంద్ మహీంద్రా సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటారనే విషయం తెలిసిందే. సమాజానికి అవసరమయ్యే, సమాజంలో విలువలను గుర్తు చేసే పోస్టలతో పాటు మోటివేషనల్ ట్వీట్స్ చేస్తుంటారాయన. ఇదే కోవలో తాజాగా ఆనంద్ మహీంద్రా చేసిన ట్వీట్ ఒకటి సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. "మిమ్మల్ని మీరు ఎప్పుడూ తక్కువ అంచనా వేసుకోవద్దు. మీరు ఊహించిన దానికంటే ఎక్కువ కండబలం మీకు ఉండవచ్చు" అనే లైన్లతో ఆయన ఒక వీడియోను పోస్ట్ చేశారు. మండే మోటివేషన్ పేరిట ఆనంద్ మహీంద్రా పంచుకున్న ఈ స్ఫూర్తివంతమైన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతోంది. వీడియోలో ఓ బక్కపలచని వ్యక్తి.. కండలవీరుడిగా ఉన్న మరో వ్యక్తి చేతిపట్టులో ఓడించడం ఉంది. కాగా, టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఆదివారం సూపర్-8 మ్యాచ్‌లో బలమైన ఆస్ట్రేలియాను పసికూన ఆఫ్ఘనిస్థాన్ మట్టికరిపించిన విషయం తెలిసిందే. దీన్ని ఉద్దేశిస్తూ ఉన్న వీడియోనే ఆనంద్ మహీంద్రా పంచుకున్నారు.

## కల్తీసారా ఘటనలో 58కి పెరిగిన మృతులు..

# పలువురికి వెంటిలేటర్‌పై చికిత్స



తమిళనాడు రాష్ట్రంలోని కళ్లకురిచి జిల్లా కరుణాపురంలో కల్తీసారా కలకలం సృష్టిస్తోన్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. సోమవారం వరకూ కల్తీసారా ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 58కి పెరిగినట్లు కళ్లకురిచి జిల్లా కలెక్టర్ ఎమ్ఎస్ ప్రశాంత్ తెలిపారు. విళుపురం, కళ్లకురిచి, సేలం, పుదుచ్చేరి ప్రభుత్వ ఆసుపత్రుల్లో 200 మందికిపైగా బాధితులు చికిత్స పొందుతున్నారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. పలువురు బాధితులు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మరోవైపు ఈ ఘటనకు కారకులైన 11 మందిని సీబీసీఐడీ పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. కల్తీసారా ప్రభావంతో కొందరికి కిడ్నీలు, ఇతర అవయవాలు విఫలమవుతున్నట్లు ఆసుపత్రి వైద్యులు తెలిపారు.

## 15 రోజుల అరాచకాలు.. మోదీపై తీవ్ర విమర్శలు చేసిన రాహుల్ గాంధీ



**ఢిల్లీ:** మోదీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ మూడోసారి అధికారం చేపట్టిన 15 రోజులపాటు అరాచక పాలన కొనసాగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. 15 రోజుల్లో ప్రజలు ఎదుర్కొన్న పది సమస్యలపై ఆయన ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. ప్రజా సమస్యల్ని పక్కకు పెట్టి.. ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో మోదీ బిజీగా ఉన్నారని ఆరోపించారు. ఎక్స్‌లో ఆయన సుదీర్ఘ పోస్ట్ చేశారు. అందులో పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైలు ప్రమాదం నుంచి కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడుల వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. 15 రోజుల్లో భయంకరమైన రైలు ప్రమాదం, కశ్మీర్‌లో ఉగ్రదాడులు, రైళ్లలో ప్రయాణికుల దుస్థితి, నీట్ స్కామ్, పీజీ రద్దు, పేపర్ లీక్, పెరుగుతున్న పాలు, పప్పులు, గ్యాస్, టోల్ ధరలు, మంటలతో మండుతున్న అడవులు, తాగునీటితో అల్లాడుతున్న ప్రజలు వంటి సమస్యలను ఆయన లేవనెత్తారు. సొంతంగా మెజారిటీ తెచ్చుకోలేని బీజేపీకి ప్రజా సమస్యలు పట్టవని.. ఆ పార్టీ నేతలంతా ప్రభుత్వాన్ని కాపాడుకోవడంలో బిజీగా ఉన్నారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని అలా తాము జరగనివ్వమని రాహుల్ స్పష్టం చేశారు.

# కమలం...యాక్షన్ ప్లాన్ ఏంటీ

-మొదటిపేజీ తరువాయి

88 అసెంబ్లీ స్థానాలు గెలుస్తామనే ధీమాతో మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2028 ఎన్నికలే టార్గెట్ గా ప్రణాళికలను అందుకోవాలంటే.. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ నిలబడాలని.. అందుకు గాను బీఆర్ఎస్ స్థానాన్ని భర్తీ చేసే ప్లాన్ లో బీజేపీ నేతలు తలమునకలు అవుతున్నారు. బీఆర్ఎస్ నేతలను బీజేపీలోకి తెచ్చుకొని.. కారు పార్టీని ఖాళీ చేయాలనే కమలం నేతల వ్యూహాలు మాత్రం బెడిసికొడుతున్నాయి. బీఆర్ఎస్ ను వీడుతున్న నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకే ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకునేందుకు యత్నించడం.. ప్రజల్లో ప్రజాపాలన పట్ల మంచి అభిప్రాయం ఉండటమే అందుకు కారణంగా చెబుతున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో బీఆర్ఎస్ స్థానానికి బీజేపీ రావాలంటే.. ఆపరేషన్ కమలం స్పీడప్ చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సూచిస్తున్నారు. రాష్ట్రంలో కారు పార్టీని ఖాళీ చేసి, బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడుతుందా..? లేదా అనేదే అటుంచితే? ఆపరేషన్ లోటస్ లోకి వచ్చే నేతలు ఎవరున్నారు..? ఎవరొస్తారు..? అనే చర్చ బీజేపీలో జోరుగా సాగుతోంది. గ్రౌండ్ లేవల్లో పార్టీ బలంగా లేకుండా రాష్ట్రంలో ప్రత్యామ్నాయంగా బీజేపీ ఎలా ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సైతం అపరేషన్ లోటస్ పూర్తిగా విఫలం అయ్యిందనే విమర్శలు సైతం సొంత నేతల నుంచే రావడం నాయకులను విస్మయానికి గురి చేస్తున్నాయి. ఆపరేషన్ లోటస్ కు పడిన నేతలు కూడా ఎక్కువకాలం పార్టీలో ఇమడలేక తిరిగి సొంత గూటికి వెళ్లడం కమలం నేతల్లో కలవరం పుట్టిస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా కేంద్ర కేబినెట్ లో అవకాశం రాని ప్రస్తుత ఎంపీలు సైతం అసంతృప్తితో ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. దాంతో ఎవరు ఎప్పుడు బీజేపీ నుంచి జంప్ అవుతారో తెలియని సస్పెన్స్ పార్టీ వర్గాల్లో నెలకొంది. మోడీ హవా తగ్గిందనడానికి



మొన్నటి ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు రాకపోవడమే అనేది క్లియర్ కట్ గా నేతలను ఆలోచనలో పడేస్తోందని రాజకీయ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. దిద్దుబాటు చర్యలు తీసుకోకపోతే బీజేపీ రాష్ట్రంలో ప్రత్యామ్నాయం మాట పక్కన పెడితే.. ఉన్న క్యాడర్ ని కూడా కోల్పోయి.. జీరోకు పడిపోయే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా నిలవాలని.. ఉవ్విల్లూరుతున్న బీజేపీ నేతలకు.. ప్రస్తుత పరిస్థితులు మాత్రం ఫిఫ్టీ ఫిఫ్టీగా ఉన్నాయి. స్థానాల విషయంలో లక్ష్యం నెరవేరకపోయినా.. బీఆర్ఎస్ స్థానం లోకి మాత్రం వచ్చే అవకాశాలు కనబడుతున్నాయి. బీఆర్ఎస్ ఖాళీ అయితే.. రాష్ట్రంలో కాంగ్రెస్ తరువాత స్థానంలో బీజేపీ ఉంటుంది. ప్రజలు తప్పకుండా బీజేపీ వైపు చూస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనను చూసిన ప్రజలు.. బీజేపీని కూడా పట్టం కడతారని అంచనా వేసుకుంటున్నారు. ఆ నమ్మకంతోనే ఎన్నికలు ఎప్పుడొచ్చినా 88 స్థానాలు గెలుస్తామనే ధీమాతో బీజేపీ నేతలు ఉన్నారని చర్చ జరుగుతోంది. ఇక మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్, విచారణ సంస్థలే ప్రధాన అస్త్రాలుగా తెలంగాణలో ఆకర్ష్ కమలం స్పీడ్ పెంచాలనే ప్లాన్ లో ఉందనే టాక్ వినిపిస్తోంది. మొత్తంగా రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా నిలబడుతాం.. ఎన్నికలు ఎప్పుడొచ్చినా 88 స్థానాలతో అధికారాన్ని చేపడతామని కలలు కంటున్న బీజేపీ ఆశలు.. నెరవేరుతాయా లేదా అనేది చూడాలి.

# సారు...కారు... బేజారు..

-మొదటిపేజీ తరువాయి

మొన్న మొన్నటి వరకు.. అంటే అధికారం పోయేంత వరకు ఏ రోజైనా పార్టీ నేతలతో భేటీ అయ్యారా? కనీసం ఎమ్మెల్యేలతో అయినా మాట్లాడరా? లేదు. కానీ కాలం మహాచెడ్డది కదా.. ఎన్నికల ముందు వరకు వీనిలాకాశంలో విహరిస్తున్న కేసీఆర్‌ను తమ ఓటుతో నేలకు దించారు ప్రజలు. దీంతో ఇప్పుడు అందరూ కనిపిస్తున్నారు.. అందరితో ముచ్చటించేందుకు ప్రయత్నిస్తున్నారు.. కాని అస్సలు కుదరడం లేదంట. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో ఏం నడుస్తోంది? ఇది ప్రశ్న.. ఎప్పుడూ ఖాళీ అవుతుందో అస్సలు సమజ్ అవ్వడం లేదు. ఇదీ సమాధానం.. ఎందుకంటే ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు నేరుగా కేసీఆర్ రంగంలోకి దిగినా పనులు కావడం లేదని ప్రస్తుతం ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లో వినిపిస్తున్న టాక్. కొడితే ఏనుగు కుంభస్థలాన్నే కొట్టాలి అన్నట్టుగా కాంగ్రెస్ వ్యూహాలు కనిపిస్తున్నాయి. ఏకంగా బీఆర్ఎస్ కీలక నేత, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డికి కండువా కప్పేశారు సీఎం రేవంత్ రెడ్డి.. ఆ వెంటనే ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జనారెడ్డితో భేటీ అయ్యారు. చూస్తుంటే ఉన్న 38 మంది ఎమ్మెల్యేల్లో ఓ 15 మంది వరకు జంప్ అయ్యే అవకాశం ఉందని తెలుస్తుంది. దీంతో సీన్‌లోకి కేటీఆర్.. ట్రబుల్ షూటర్‌గా పేరున్న హరీష్‌రావు ఎంట్రీ ఇచ్చారు. కానీ పనవ్వడం లేదు.. ఎమ్మెల్యేలను కాపాడుకోలేని పరిస్థితి ఉన్నట్టు కనిపిస్తుంది. దీంతో ఆఖరిగా.. బ్రహ్మాస్త్రంగా కేసీఆరే నేరుగా రంగంలోకి దిగారు. పదేళ్ల తన పాలనలో ఎమ్మెల్యేలతో కేసీఆర్ ఎప్పుడైనా మాట్లాడారా.. ? నలుగురితో నారాయణ అన్నట్టుగా అందరిని సమావేశపరిచి మాట్లాడట మే. అది కూడా వేళ్లపై లెక్కపెట్టే అన్నిసార్లు జరిగాయి ఆ సమావేశాలు. వారు అపాయింట్‌మెంట్ కోరినా ఇవ్వలేదన్న ఆరోపణలు ఎన్నో.. కానీ ఇప్పుడు ఉన్న ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు కేసీఆరే నేరుగా ఫోన్ చేసినా.. ఎవ్వరూ పట్టించుకోవడం లేదని తెలుస్తుంది. ఎమ్మెల్యే జంపింగ్స్‌తో కేసీఆర్‌లో టెన్షన్ మొదలైనట్టు తెలుస్తుంది. ఫామ్‌హౌస్‌లో



హరీష్‌రావు, కేటీఆర్‌తో ప్రత్యేకంగా మీట్ అయ్యారు. అసలు ఎమ్మెల్యేలను ఆపడం ఎలా టాపిక్‌పై డిస్కషన్ చేశారు. ఎందుకంటే పోచారం లాంటి నేతే కాంగ్రెస్ చేరడం అనేది కేసీఆర్‌కు అస్సలు మింగుడు పడని అంశం. దీంతో ఇతర ఎమ్మెల్యేల పరిస్థితి ఏంటని ఆరా తీశారు. జంప్ అయ్యే ఎమ్మెల్యేల లిస్ట్ తయారు చేశారు. వారికి నేరుగా కేసీఆర్ ఫోన్ చేసి మాట్లాడినట్టు తెలుస్తుంది. పార్టీ మారవద్దని కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాలని హితబోధ చేసినట్టు తెలుస్తుంది. అయితే వారిని ఫామ్‌హౌస్‌కు రమ్మని పిలిచినా.. ఒక్కరు కూడా పట్టించుకోలేదని తెలుస్తుంది. అయితే కేసీఆర్‌కు రెండు రకాల టెన్షన్స్ మొదలైనట్టు తెలుస్తుంది. ఓ వైపు కాంగ్రెస్.. మరోవైపు బీజేపీ.. అవును.. బీజేపీ కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై నజర్ పెట్టింది. రెండు పార్టీలు కూడా ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టాయి. ఒకటి రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ.. మరొకటి కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ..దీంతో చాలా మంది ఎమ్మెల్యేలు ఏ పార్టీలో చేరాలన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు నజర్ పెట్టినట్టు తెలుస్తోంది. అలాంటి నేతలంతా త్వరలో కాషాయ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తుంది. కానీ మెజార్టీ ఎమ్మెల్యేల చూపు కాంగ్రెస్‌వైపే ఉన్నట్టు తెలుస్తుంది. దీనికి సంబంధించి ఇప్పటికే జోరుగా మంతనాలు నడుస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉండే ఓ అగ్రనేత ఈ వ్యవహారాలను చక్కదిద్దుతున్నట్టు తెలుస్తోంది. పోచారం కాంగ్రెస్‌లో అధికారికంగా చేరడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 38కు చేరింది. కనీసం తక్కువలో తక్కువ 12 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారనేది ప్రస్తుతం వినిపిస్తున్న టాక్.. మిగిలిన ఎమ్మెల్యేల చూపు బీజేపీవైపు ఉన్నట్టు కనిపిస్తుంది. మొత్తానికి అప్పుడు సిగలు పట్టుకొని పార్టీ నేతలను ఓ ఆట ఆడించిన కేసీఆర్.. ఇప్పుడు కాళ్లు పట్టుకొని ప్రాధేయపడేంత పని చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని తెలుస్తుంది.

# అసలైన లబ్ధిదారులు గుర్తించే పనిలో సర్కార్

**వరంగల్ :** పేరుకే పథకాలను పేదల కోసం అంటారు తప్పా.. దాని వెనక లబ్ధిదారులు వేరే ఉంటారు. అలాంటి వాటికి చెక్ పెట్టాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలను అమలు చేయడానికి నిధులు సమకూరుస్తోంది. కేబినెట్ కూడా దానిపై ఓ నిర్ణయం తీసుకుంది. అయితే, నిజమైన లబ్ధిదారులకే రైతుల భరోసా అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. అంతేకాదు.. గత ప్రభుత్వం శ్రీమంతులకు, ఫామ్ హౌజ్ ఓనర్లకు, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారికి కూడా రైతుబంధు ఇచ్చిందని ఆరోపించింది. ఆయన బీఆర్ఎస్‌పై రాజకీయ విమర్శలు చేశారనుకోవడానికి లేదు. నిజంగానే ప్రజాధనం పెద్ద ఎత్తున లూటీ అయిందని లెక్కలు చెబుతున్నాయి. క్రాప్ లోన్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు బ్యాంకుల దగ్గర రుణాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ మహానగరంలో కూడా పెద్ద ఎత్తున వ్యవసాయం చేస్తున్నట్టు చూపిస్తున్నారు. 2023?24 ఏడాదిలో హైదరాబాద్ లో బ్యాంకర్లు రూ. 1550 కోట్ల పంట రుణాలు ఇచ్చారు. ఇవి బ్యాంకులు చెబుతున్న లెక్కలే. గతే ఏడాడి మేడ్చల్ జిల్లాలో కేవలం 18,199 ఎకరాల భూమిలోనే పంటలు సాగవుతాయి. దానికి రూ. 242 కోట్ల పంట రుణాలు ఇవ్వాలని బ్యాంకులు టార్గెట్ గా పెట్టుకున్నాయి. కానీ.. ఏకంగా రూ. 2386.48 కోట్ల రుణాలు మంజూరు



అయ్యాయి. అవి కూడా క్రాప్ లోన్సే. అంటే సుమారు 1000 శాతం ఎక్కువగా లోన్లు ఇచ్చారు. అంత మొత్తంలో మేడ్చల్ జిల్లాలో పంటలు పండుతున్నాయా? అనేది చూడాలి. మరో విచిత్రం ఏంటీ అంటే.. క్రాప్ లోన్స్ ముంజూరులో మేడ్చల్ జిల్లా టాప్ ప్లేస్. అంటే.. గ్రామీణ జిల్లాల కంటే ఇక్కడే ఎక్కువగా పంటలు పండుతున్నాయన్నది బ్యాంకర్ల లెక్క. మేడ్చల్ తర్వాతి స్థానంలో రంగారెడ్డి జిల్లా ఉంది. హైదరాబాద్ మహానగరంలో వ్యవసాయ రుణాలు మంజురు చేయడం ఏంటి అని గత ప్రభుత్వ పెద్దలు అడిగింది లేదు. దీని వలన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేద రైతులకు అందాల్సిన రుణాలు అందడం లేదు. నిజమైన రైతులకు న్యాయం జరగడం లేదు. రైతు బంధు కూడా ఇలాగే అమలు చేశారనే వాదనలు కూడా ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డి నిజమైన రైతులకే రైతు భరోసా అందిస్తామని ప్రకటించారు. నిజంగానే సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్టు రియల్ ఎస్టేట్ వ్యాపారలను, భూ స్వాములను తప్పిస్తే పేదలకు మరింత ఎక్కువ సాయం చేయొచ్చు. అదే సమయంలో ప్రభుత్వానికి కూడా భారం తగ్గుతోంది. రైతు భరోసా విషయంలోనే కాదు.. రుణ మాఫీ కూడా ఇలాగే చేయాల్సి ఉంది. ఇప్పటికే ప్రభుత్వం కూడా రుణమాఫీ విషయంలో కీలక ప్రకటన చేసింది. ట్యాక్సులు కడుతున్న వారు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు రుణమాఫీ ఉండదని ప్రకటించారు. వారితో పాటు వ్యవసాయమే చేయకుండా రుణాలు తీసుకుంటున్న వారిని కూడా గుర్తించి తప్పించాలి. అప్పుడే రైతాంగానికి మరింత మేలు జరుగుతోంది. రైతు భరోసా విషయంలో ప్రభుత్వం ఎలాంటి విధి విధానాలు అమలు చేస్తుందో చూడాలి. 5 ఎకరాలు కంటే ఎక్కువగా ఉన్నవారిని పక్కకు తప్పించే అవకాశం ఉందని చర్చ నడుస్తోంది. అదే జరిగితే ఓ విధంగా మంచిదనే చెప్పాలి. ఇది జరగాలంటే కొన్ని వర్గాల నుంచి ఒత్తిళ్లు రావచ్చు. అయితే, ఆ ఒత్తిళ్లకు తలొగ్గడానికి అక్కడ ఉన్నది కేసీఆర్ కాదని.. రేవంత్ రెడ్డి అని కాంగ్రెస్ శ్రేణులు చెబుతున్నాయి. నిజంగా రేవంత్ రెడ్డి నిజమైన రైతులను గుర్తించి పథకం అమలు చేస్తే ప్రభుత్వానికి కొంత భారం తగ్గినట్టే.

## రక్షణ శాఖ భూములు కేటాయించాలి



-మొదటిపేజీ తరువాయి

ఈరోజు (మంగళవారం) ఢిల్లీ వెళ్లిన విషయం తెలిసిందే. ఢిల్లీలో సీఎం బిజీ బిజీగా ఉన్నారు. పలువురు కేంద్రమంత్రులను, ఏఐసీసీ అగ్రనేతలను ముఖ్యమంత్రి కలవనున్నారు. రాష్ట్ర సమస్యలను కేంద్రమంత్రుల దగ్గరికి సీఎం తీసుకెళ్లనున్నారు. ఇందులో భాగంగానే మధ్యాహ్నం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీలు భేటీ అయ్యారు. రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీల భేటీ ముగిసింది. డిఫెన్స్ భూములు, వరంగల్లో సైనిక్ స్కూల్ ఏర్పాటు ఇతర అంశాల గురించి రాజ్‌నాథ్ సింగ్‌కి విజ్ఞప్తి చేశారు. రక్షణ భూముల బదలాయింపుపై రాజ్‌నాథ్ సింగ్‌కు రేవంత్ విజ్ఞాపనలు ఇచ్చారు. హైదరాబాద్ నగరంలో రహదారులు, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రక్షణ శాఖ పరిధిలో ఉన్న భూములు కేటాయించాలని రాజ్‌నాథ్ సింగ్‌ను సీఎం కోరారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు మెహిదీపట్నం రైతు బజార్ వద్ద స్కైవాక్ నిర్మిస్తున్నామని, ఇందుకోసం అక్కడ ఉన్న రక్షణ శాఖ భూమి 0.21 హెక్టార్లను బదిలీ చేయాలని కేంద్రమంత్రిని సీఎం కోరారు. రాష్టంలో స్కై వేల నిర్మాణం, రక్షణ శాఖ భూముల బదలాయింపులపై రాజ్‌నాథ్ సింగ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ చర్చించారు.

## రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



-మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, రాజేశ్, మెగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి శ్రీశైల మల్లికార్జున స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... ఇరు రాష్ట్రాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని రుతుపవనాలు మెండుగా రావాలని కరువు, కాటకాలు లేకుండా చూడాలని పంటలు బాగా పండాలని మల్లన్నస్వామిని వేడుకున్నానని తెలిపారు. శ్రీశైలం ఎడమగట్టు విద్యుత్ కేంద్రం అధికారులతో విద్యుత్ ఉత్పత్తిపై చర్చించడానికి శ్రీశైలం వచ్చానని చెప్పారు. రుతుపవనాలు బలంగా వీచాలని... పంటలు బాగా పండాలని... వర్షాలు పడాలని కోరుకున్నట్లు చెప్పరు. తెలుగువారందరి జీవితాల్లో వెలుగులు నిండాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున దేవుడిని కోరుకున్నానన్నారు. ప్రపంచంలో తెలుగువారు ఎక్కడ ఉన్నా వారి జీవితాల్లో వెలుగులు నింపాలని... మంచిపేరు తీసుకురావాలని మల్లికార్జున, భ్రమరాంబిక అమ్మవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నానన్నారు.

### విద్యుత్ ఉత్పత్తికి కొరత లేకుండా చర్యలు

శ్రీశైలం హైడల్ పవర్ ప్రాజెక్టు చాలా ముఖ్యమైనదని, గొప్ప ప్రాజెక్టు కట్టిన ఆనాటి నాయకులు స్మరిస్తూ ధన్యవాదాలు చేశానని అన్నారు. శ్రీశైలం ఎడమగట్టు హైడల్ పవర్ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి కోసం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ రాష్టంలో విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి కొరత లేకుండా కావలసిన చర్యలు ఇప్పటికే చేపట్టామన్నారు, భవిష్యత్తులో 2029-30 వరకు విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణలో 2029-30 వరకు విద్యుత్ కొరత లేకుండా చర్యలు చేపడుతున్నట్లు భట్టివిక్రమార్క చెప్పారు. రుతుపవనాలు రాకముందే శ్రీశైలం హైడల్ ప్రాజెక్టును సమీక్షించి తద్వారా పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తికి కావాల్సిన చర్యలు చేపట్టడమే తన పర్యటన ఉద్దేశం అన్నారు. నాటి కాంగ్రెస్ పెద్దల ముందుచూపుతో నిర్మించిన బహుళార్థక సాధక ప్రాజెక్టులతో మన జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. శ్రీశైలం హైడల్ ప్రాజెక్టు ద్వారా అత్యధికస్థాయిలో విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణలో రెప్పపాటు కూడా కరెంట్ కోత లేదన్నారు.

## సమ్మె యథాతథం



-మొదటిపేజీ తరువాయి

అసంపూర్తిగా ముగిశాయని తెలిపారు. జూడాలు పలు డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. మరికొన్ని అంశాలపై మరోమారు చర్చించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఆయా అంశాలపై ప్రపోజల్స్ ఉన్నతాధికారులకు పంపించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతానికి సమ్మె యధాతథంగా కొనసాగిస్తామని, చర్చలు అసంపూర్తిగా ముగిశాయని జూడాలు తెలిపారు. డాక్టర్ల భద్రత గురించి ఆలోచిస్తామని, స్టైఫండ్‌కు గ్రీన్ ఛానల్‌పై మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామని వైద్యారోగ్య శాఖ మంత్రి చెప్పినట్లు జూనియర్ డాక్టర్లు పేర్కొన్నారు. సమ్మె కొనసాగింపుపై రాష్ట్ర స్థాయి జూడాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అప్పటి వరకు సమ్మె యథాతథంగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. గ్రీన్ చానెల్ ఏర్పాటు చేసి ప్రతి నెలా స్టైఫండ్ చెల్లింపు, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌లకు రూ. 1.25 లక్షల గౌరవ వేతనం, మెడికల్ కాలేజీల్లో పెంచిన 15 శాతం సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఇవ్వకూడదని, డాక్టర్లపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలనే పలు డిమాండ్లతో జూనియర్ డాక్టర్లు సమ్మె చేస్తున్నారు. వైద్యుల భద్రత గురించి మంత్రి ఆలోచిస్తామన్నారని, స్టైఫండ్‌కు గ్రీన్‌ఛానల్‌పై మరోకసారి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సమ్మె కొనసాగింపుపై రాష్ట్రస్థాయి జూడాలతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, అప్పటి వరకు సమ్మె యథాతథంగా కొనసాగిస్తామని జూడాలు వెల్లడించారు. గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ప్రతినెలా స్టైఫండ్ చెల్లింపు, సూపర్ స్పెషాలిటీ సీనియర్ రెసిడెంట్‌లకు రూ. 1.25 లక్షల గౌరవ వేతనం, వైద్యకళాశాలల్లో పెంచిన 15 శాతం సీట్లలో ఏపీ విద్యార్థులకు అవకాశం ఇవ్వకూడదని, వైద్యులపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలనే పలు డిమాండ్లతో జూడాలు సమ్మె బాట పట్టారు.

# శ్రీ వేద ఆసుపత్రిని ప్రారంభించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి






**తక్కువ ఖర్చుతోనే పేదలకు వైద్య సదుపాయంబీ శ్రీ వేద ఆసుపత్రి యాజమాన్యం**

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** పటాన్చెరు నియోజకవర్గ%శీ% రామచంద్రపురం మండలం బీరంగూడ కమాన్ వద్ద శ్రీ వేద మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని ఆదివారం పలువురు ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. డాక్టర్ అరవింద్ రెడ్డి, సిద్ధ లింగస్వామి, రవికుమార్,నర్మదా, రవీంద్ర, సుధాకర్ రెడ్డి తదితరులు కలిసి పేదవారికి తక్కువ ఖర్చుతో చికిత్స చేయాలనే దృఢ సంకల్పంతో ఈ ఆస్పత్రిని నిర్మించి,తక్కువ ఖర్చుతో వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసి,అంబులెన్స్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయాలని దృక్పథంతో తక్కువ ఖర్చుతో ప్రతి ఒక్కరికి వైద్యం అందిస్తామని అన్నారు. అనుభవజ్ఞులైన డాక్టర్లతో ఆస్పత్రి 24 గంటలు అత్యవసర చికిత్సలతో అందుబాటులో ఉంటాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆధునిక వైద్యాన్ని ప్రజలకు అందుబాటులో తీసుకురావడం శుభ పరిణామం అని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని ఆసుపత్రిలు ఉన్న పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజల సౌకర్యం కోసం పట్టణ ప్రాంతాల్లో కూడా ఇలాంటి వైద్య సదుపాయం గల మంచి ఆసుపత్రిని అందుబాటులోకి రావడంతో ప్రజలు సద్వినియోగం చేసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి, ఏఐజి హాస్పిటల్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, ఏఐఎన్యు డాక్టర్ మల్లికార్జున, స్థానిక బీజేపీ నాయకులు గోదావరి అంజిరెడ్డి, ఎడ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల కేసులో నిందితులకు బెయిల్ రద్దు చేసిన కోర్టు

**జ్యుడీషియల్ రిమాండ్ విధించిన కోర్టు**
**వివరాలు వెల్లడించిన డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి**



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** విత్తనాల కొరత సృష్టించి రైతులను దోచుకున్న సామ అశోక్ రెడ్డి, రాజేందర్ ల బెయిల్ పిటిషన్ ను డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి ఈరోజు (సోమవారం) వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన గత నెల 25న ఆదిలాబాద్ పట్టణం నందు పెద్ద ఎత్తున నకిలీ విత్తనాల తయారు కేంద్రాన్ని నెలకొల్పి, రైతులను మోసగించే ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో నిందితుల వద్ద నుండి దాదాపు 500 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల నిందితులకు బెల్ లభించడంతో, జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు జిల్లా సెషన్స్ కోర్టు నందు రివిజన్ ఫైల్ చేయగా, వాదనలు విన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రభాకర్ రావు గారు బెయిల్ ను రద్దుచేసి మూడు రోజుల్లోగా లొంగిపోవాలని తెలిపినట్లు డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి పేర్కొన్నారు. నిందితులు సామ అశోక్ రెడ్డి, రాజేందర్ లు మున్సిఫ్ కోర్టు నందు లొంగిపోగా, కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీని విధించడంతో పోలీసులు నిందితులను మళ్ళీ జైలుకు తరలించారు. నకిలీ విత్తనాలు ముఠా స్కామ్ ను బట్ట బయలు చేసేందుకు ప్రధాన నిందితులను 10 రోజులు కస్టడిల్లోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నేరానికి పాల్పడినటువంటి నిందితులకు ఆశ్రయమిచ్చిన షాపుల ఓనర్ కు నోటీసులు జారీ చేయడం జరిగిందని, గోడౌను సీజ్ చేయడం జరిగిందని డిఎస్పీ తెలిపారు.

# బొగ్గు చుట్టూ తిరుగుతున్న రాజకీయం



**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయం అంతా ఇప్పుడు బొగ్గు చుట్టూ తిరుగుతోంది. తెలంగాణలోని బొగ్గు గనులు సింగరేణికి కేటాయించకుండా కేంద్రం వేలం వేసింది. ఈ వేలం ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వం కూడా పాల్గొన్నది. అందుకే బీఆర్ఎస్ నేతలు విరుచుకుపడుతున్నారు. సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్, బీజేపీ కలిసి కుట్ర చేస్తున్నాయని కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. తమ హయాంలో బొగ్గు బ్లాకుల వేలాన్ని తీవ్రంగా వ్యతిరేకించామని సింగరేణిని కూడా వేలంలో పాల్గొనడానికి అంగీకరించలేదని బీఆర్ఎస్ వాదిస్తోంది. అయితే ఈ విషయంపై కాంగ్రెస్ భిన్నంగా స్పందిస్తోంది. వేలంలో పాల్గొనకుండా సింగరేణికి నష్టం చేశారని కోల్ బ్లాకులు బీఆర్ఎస్ నేతల సన్నిహితులుక చెందడానికే ఇలా చేశారంటున్నారు. సింగరేణికి ప్రస్తుతం ఉన్న బొగ్గు గనులు మరో పదేళ్లలో అయిపోతాయని ఆ తర్వాత పరిస్థితేమిటని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. వేలంలో అయినా బొగ్గు గనులు దక్కించుకోవాలని.. తర్వాత కేంద్రంపై పోరాడి .. దొరికిన గనులు కేటాయింప చేసుకోవాలని కాంగ్రెస్ వాదిస్తోంది. బీఆర్ఎస్ వల్లే సింగరేణికి పెను ముప్పు ఏర్పడిందని అంటోంది. సింగరేణి ప్రభుత్వ సంస్థ. తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటాలున్నాయి. అంటే వంద శాతం ప్రభుత్వ సంస్థ. బొగ్గు గనులు వీటికి కేటాయించడం అంటే ప్రభుత్వానికి కేటాయించడమే అనుకోవచ్చు. కానీ కేంద్రం.. ప్రైవేటు సంస్థలతో పాటు సింగరేణి కూడా పోటీ పడి బొగ్గు గనులు దక్కించుకోవాల్సిందేనని విధాన నిర్ణయం తీసుకుంది. దేశంలో ఉన్న బొగ్గు గనులన్నింటినీ వేలం వేస్తూ వస్తోంది. దేశంలోని సుమారు 500 బొగ్గు బ్లాకుల్లో ఇప్పటికే 300 బ్లాకుల వేలం పాట పూర్తయింది. ఈ విధానం వల్ల రాష్ట్రాలకు ఆదాయం పెరుగుతుందని కేంద్రం చెబుతోంది. తెలంగాణలో ఉన్న బొగ్గు గనులు గతంలో సింగరేణికే కేటాయించేవారు. కానీ కేంద్రం వేలం నిర్ణయం తీసుకున్న తర్వాత సింగరేణి కూడా వేలంలోనే గనులు దక్కించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా హైదరాబాద్‌లో శ్రావణపల్లి బ్లాకు వేలం ప్రక్రియ జరిగింది. శ్రావణపల్లి బ్లాకులో 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలున్నట్టు గతంలో సింగరేణి నిర్వహించిన భూగర్భ సర్వేలో తేలింది. సింగరేణి ఏరియాలో ఉన్న ఈ బొగ్గు బ్లాకును వేలం వేయకుండా, నేరుగా సింగరేణికే కేటాయించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిమాండ్ చేసినా.. కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. కేంద్రం ఇంతకుముందు పలు దఫాలుగా సింగరేణి ఏరియాలోని కల్యాణఖని, శ్రావణపల్లి, కోయగూడెం, సత్తుపల్లి బొగ్గుబ్లాకులకు వేలం నిర్వహించింది. అప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారు ఆ వేలాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. వేలంలో పాల్గొనలేదు. ఫలితంగా ఆ బొగ్గు గనులు సింగరేణికి దక్కలేదు. వేలంలో ఇతరులకు దక్కాయి. ఇక ముందు కూడా వేలంలో పాల్గొనకపోతే సింగరేణి వట్టిపోతుందన్న ఆందోళనతో శ్రావణపల్లి బ్లాకును దక్కించుకునేందుకు వేలంలో పాల్గొన్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోంది. అప్పటి బీఆర్ఎస్ సర్కార్ కుట్రతోనే వేలంలో పాల్గొనలేదని బీజేపీ, కాంగ్రెస్ ఆరోపిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కేంద్రం బొగ్గు గనుల వేలం వేసింది. 2022 అక్టోబర్‌లో కోయగూడెం బ్లాక్‌ను వేలం వేశారు. 2023లో ఆగస్టులో సత్తుపల్లి బ్లాక్‌ను వేలం వేశారు. కోయగూడెం బ్లాక్‌ను దక్కించుకున్నది అరో కోల్ ప్రైవేట్ లిమిటెడ్. ఇది అరబిందో సంస్థకు చెందినది. సత్తుపల్లి బ్లాక్‌ను శ్రీ అవంతిక కాంట్రాక్టర్స్ ఇండియా లిమిటెడ్ దక్కించుకుంది. ఇది ప్రతిమ గ్రూపు కంపెనీ. ఈ రెండు కంపెనీలు కేసీఆర్ కుటుంబ సన్నిహితులవేనని బీజేపీ, కాంగ్రెస్ ఆరోపిస్తున్నాయి. అవి వేలంలో పాడుకోగా.. సింగరేణిని ఎందుకు వేలంలో పాల్గొనకుండా ఆపారని ప్రశ్నిస్తున్నారు. గోదావరి పరిసరాల్లో ఉన్న బొగ్గు గనుల వేలంలో పాల్గొనవద్దని అనధికారికంగా ఆదేశించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఆ వేలంలో సింగరేణి పాల్గొనలేదు. ఆ ఛాన్స్‌ను ప్రైవేట్ కంపెనీలు క్యాష్ చేసుకున్నాయి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. సింగరేణి కూడా వేలంలో పాల్గొందని కాంగ్రెస్ నేతలంటున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ కు క్యాప్టివ్ మైన్స్ లేనందు వల్ల నష్టాల్లోకి వెళ్లిపోయింది. సింగేరణిని కూడా అలాగే చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం సింగరేణికి బొగ్గు గనులు కేటాయింప చేసుకోవాల్సిన అవసరం ఉంది. లేకపోతే పదేళ్లలో సింగరేణి కనుమరుగు అవుతుంది. కొయ్యగూడెం, సత్తుపల్లిలోని 6 కోల్ బ్లాకులను ను సింగరేణికి కేటాయిస్తే అనువుగా ఉంటుందని ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈ విషయమై కిషన్ రెడ్డి ప్రధాని మోదీని ఒప్పించాలని కిషన్ రెడ్డిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు. అవసరమైతే ప్రధానితో మాట్లాడేందుకు తాను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రావడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. గనుల మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి మాత్రం సింగరేణిని కాపాడుతామని అంటున్నారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌లో సింగరేణి లాభం పొందేలా ఉత్పత్తిని ప్రారంభిస్తామన్నారు. త్వరలో ఒడిశా, తెలంగాణ ప్రభుత్వాలతో మాట్లాడుతామని చెప్పారుసింగరేణి వేలంలో పాల్గొనడం వల్ల.. ప్రైవేటీకరణకు ఒప్పుకున్నట్లేనని రెండు జాతీయ పార్టీలు కలిసి సింగరేణికి నష్టం చేస్తున్నాయని వాదిస్తున్నారు. గతంలో ప్రైవేటు సంస్థలు వేలంలో సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకులు దక్కించుకున్నా వారు తట్ట బొగ్గు కూడా వెలికి తీయకుండా అడ్డుకున్నామని కేటీఆర్ చెబుతున్నారు. కానీ గనులను వారు పాడుకున్న తర్వాత అడ్డుకునే అవకాశం ప్రభుత్వానికి ఉండదు. మూడు బ్లాకులు వేలం పాడుకున్న ఫార్మా కంపెనీ బొగ్గు బయటికి తీసే యంత్రాలు లేక, సాంకేతిక పద్ధతులు రాక బొగ్గు తవ్వలేకపోయారన్న విమర్శలు ఉన్నాయి. బీఆర్ఎస్ వాదన ప్రకారం వేలంలో పాల్గొనకపోతే సింగరేణికి గనులు ఉండవు.. కేంద్రం కేటాయించదు. అప్పుడు సింగరేణికే నష్టం. అందుకే బీఆర్ఎస్ వాదనలో అసలు పస లేదని రెండు జాతీయ పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు.

## సర్వే నెంబర్ 376 బాధ్యత రైతులకు న్యాయం చేయండి



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం జిన్నారం గ్రామంలో సర్వేనెంబర్ 1జంగంపేట సర్వేనెంబర్ 376 రైతులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిన్నారం ఎంపీటీసీ కోరబోయిన లావణ్య నరేష్, జిన్నారం ఎంపీపీ రవీందర్ గౌడ్ రైతులతో కలిసి తహసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. జిన్నారం ఎంపీటీసీ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా రైతుల భూములు తీసుకొని ఇప్పటివరకు రైతులకు ఎలాంటి న్యాయం చేయలేదని గత ప్రభుత్వం రైతులను మభ్యపెట్టి మోసం చేసి వందల ఎకరాలు రైతుల దగ్గర నుండి తీసుకొని పెద్ద పెద్ద పరిశ్రమ యాజమాన్య కంపెనీలకు అప్పజెప్పి రైతులకు మాత్రం న్యాయం చేయకపోవడం బాధాకరమని అన్నారు. రైతుల భూములు తీసుకొని ఎకరాకు 600 గజాలు ఇస్తామని మోసం చేసి గజం స్థలం కూడా చూపియ్యకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఆనాటి ప్రభుత్వ తొత్తులుగా మారి కొంతమంది నాయకులు చీకటి ఒప్పందాలు చేసుకొని రైతులను మభ్యపెట్టి మోసం చేశారని ఆరోపించారు. వ్యవసాయం మీద ఆధారపడిన జీవన ఉపాధి చేసుకునే రైతులందరూ తమ పొలాలను కోల్పోయి నానా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. లబ్ధిదారుల తమ భూముల్లో కెళ్ళి దున్ని సాగు చేసుకుంటారని హెచ్చరించారు. ఇప్పటికైనా రైతులందరికీ న్యాయం జరిగే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వడ్డే కృష్ణ, మండల ఉపాధ్యక్షులు రాజు గౌడ్, జిన్నారం యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు యనగండ్ల నరేందర్, జిన్నారం మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్, నాయకులు బత్తుల మహేష్, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## రైతు రుణ మాఫీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్
## - సిఎం చిత్ర పటానికి పాలభి షేకం



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** గుమ్మడిదల మండల పరిధిలో గల రైతు సంగం దగ్గర కాంగ్రెస్ నాయకులు రైతులు సిఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. సిఎం రేవంత్ రెడ్డి నిన్న రైతులకు 2 లక్షల రుణ మాఫీ చేస్త అని చెప్పడంతో రైతులు అనందం తో సంబరాలు చేసుకున్నారు గుమ్మాడిదల రైతు సంఘం. ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, రైతులు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఎంపీపీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నరసింహారావు, సీనియర్ నాయకులు కొత్తపల్లి శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, రైతులు బాల్రెడ్డి, సురభి నాగేందర్ గౌడ్, గోవర్ధన్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## జిన్నారం గ్రామంలోని మార్కెట్ ని తరలించవద్దు



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జిన్నారం మండల కేంద్రంలో ప్రతి బుధవారం జరిగే వారాంతపు సంతను(మార్కెట్ ని ) గ్రామంలోనే ఉండాలని ప్రతి బుధవారం మండల పరిధిలోని చుట్టుపక్క గ్రామాల ప్రజలు వస్తారని, తద్వారా వ్యాపారం బాగుగా జరుగుతుందని, వార సంతను తరలిస్తే వ్యాపారాలు దెబ్బతింటాయని పంచాయతీ కార్యదర్శి కి వార్తక సంఘం సభ్యులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు నక్క దామోదర్, సంతోష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, రాజు గౌడ్, పని భూషణ్, యాద%శీ% రాజు, కాశ మురళి, కాశరాజు, బంజ మహేష్, మొబైల్ షాప్ చిన్న, వెంకటేష్, సంతోష్ గుప్తా, శ్రీధర్, నరేందర్, అనిల్, సురేందర్, మార్వాడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అభిమానులతో సరదాగా చిందులేసిన తిరువూరు ఎమ్మెల్యే

**మేడ్చల్ :** హైదరాబాద్ నాచారం లో తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు టిడిపి అభిమానులు అభినందన సభ ఏర్పాటు చేశారు . ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కొలికపూడీ శ్రీనివాసరావు హైదరాబాద్ రావడంతో నాచారంలో శేషగిరి రావు ఆధ్వర్యంలో టిడిపి అభిమానులు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు అభిమానులతో కలిసి డ్యాన్స్ చేసి తన ఆనందాన్ని వ్యక్తపరిచారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com